
సాక్షి ఒడిశా

ఆదివారం । 29 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,71,436లు, బంగారం 600 మిల్లీగ్రాములు, వెండి 150 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



న్యాయ పరిశోధనలకు పట్టుగొమ్మ

- 8లో



వంశధారకు.. వసంతోత్సాహం

- 8లో

న్యూస్‌రీల్

బొయిపరిగుడ సమితిలో ఏడీజీ పర్యటన



బొయిపరిగుడ పరిధి గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ సమితి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు ఏడీజీ అమితాబ్ ఠాకూర్, విజిలెన్స్ విభాగ డైరెక్టర్ సంజీవ్ పండా శనివారం పర్యటించారు. భువనేశ్వర్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో చేరుకున్న అధికారులు.. సమితిలో మావోయిస్టు కార్యకలాపాలను అణచి వేసేందుకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న బీఎస్‌ఎఫ్ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు లోని మారుమూల గ్రామాల్లో పర్యటించారు. పర్యటనలో డీఐజీ అనిరుద్ సింగ్, కొరాపుట్ డీఐజీ రాజేష్ పండిట్, బీఎస్‌ఎఫ్ డీఐజీ మదన్‌లాల్, బెటాలియన్ కమాండెంట్ అజయ్‌కుమార్, ఎస్‌డీపీఓ హరీష్ బీసీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉత్పత్తులకు గుర్తింపు



పల్లెశ్రీ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జిల్లా గ్రామీణ ప్రాంత ప్రజలు తయారు చేసిన ఉత్పత్తులకు ఎంతో ప్రజాదరణ ఉందని, వాటికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకు రావాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఓర్మాస్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన పల్లెశ్రీ మేళను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఇందులో 100కు పైగా స్టాల్స్‌లో వివిధ రకాల వస్తువులు ప్రదర్శించారు. అలాగే హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్ ప్రసారాన్ని ప్రజలు తిలకించేందుకు పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, మున్సిపల్ ఈఓ సిద్ధార్థ పట్నాయక్, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, డీపీఆర్‌ఓ యశోద గదబ, ఎస్‌డీపీఓ హరీష్ బీసీ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ విద్య

- గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గమాంగొ, ముదులి

రాయగడ: విద్యార్థులు తమ గమ్యాన్ని చేరుకోవాలంటే క్రమశిక్షణ చాలా అవసరమని గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ అన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో ఆదర్శ విద్యాలయం మూడో వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన.. మాట్లాడారు. ప్రతి విద్యార్థి తమ భవిష్యత్‌ను బంగారు బాటలో నడిపించుకోవాలంటే తగిన క్రమశిక్షణ అవసరమని తెలిపారు. రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో చదువుకున్న ఎంతోమంది ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. పట్టుదలతో పాటు శ్రమించే శక్తి ఉంటే ప్రతిఒక్కరూ రాణిస్తారని ఆకాంక్షించారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురవ్వకుండా ఉపాధ్యాయులు తగిన సూచనలందించాలన్నారు. ఆధునిక, సాంకేతిక విద్యావిధానం అందరికీ అందేలా రాష్ట్ర ప్రభుత్వం 5టీ పథకంలో అన్ని రకాల సౌకర్యాలను మెరుగు పరిచిందని, వీటిని వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సంజుక్త కులసిక, డాక్టర్ ఇందిరా అధికారి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ముఠా అరెస్ట్

బరంపురం: గొళంతరా పోలీస్ స్టేషన్ పరిధి రాజేంద్రనగర్‌లో ఇటీవల జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఐఐసీ అధికారి సవ్యాసాచి మాలిక్ తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన దోపిడీలకు సంబంధించి రూ.5 లక్షల విలువైన చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితులు జిల్లా బబనపూర్ గ్రామానికి చెందిన అబు ఆచార్య, సుకుండాకి చెందిన కె.రాజేష్, పత్రపూర్‌కు చెందిన జిత్తు పాత్రొ, సుజనా ప్రధాన్, మిట్టు నాయక్‌గా గుర్తించారు.



పర్లాకిమిడి: భాస్కరునికి పూజలు చేస్తున్న ప్రధానార్చకులు దుర్గాప్రసాద్ దాస్

- కొణార్క్ చంద్రభాగ సముద్ర తీరంలో మాఘ సప్తమి సందడి
- రాత్రి నుంచే గుడారాల్లో బసచేసిన వేలాదిమంది యాత్రికులు
- దేవుళ్ల పుణ్యస్నానాల అనంతరం భక్తులకు అవకాశం
- కొణార్క్ సూర్య దేవాలయంలో కొనసాగిన సంప్రదాయ ప్రదక్షణలు

చంద్రభాగాన.. సూర్యారాధన



బరంపురం: గోపాల్‌పూర్‌లో సముద్ర స్నానాలు చేస్తున్న ప్రజలు



చంద్రభాగలో దేవుళ్ల తొలిస్నానం



రాయగడ: సంతోషిమాత మందిరం ప్రాంగణంలోని సూర్య మందిరంలో పూజలు

భువనేశ్వర్: పవిత్ర మాఘ సప్తమి పురస్కరించుకుని కోణార్కు చంద్రభాగ తీరం జన సందోహంతో కిటకిటలాడింది. షష్టి తిథి(ముందు రోజు) సాయంత్రం నుంచి ఈ తీరానికి తండోప తండాలుగా భక్తులు తరలి వచ్చారు. సప్తమి ఉషోదయ వేళలో పుణ్యస్నానాలు ఆచరించారు. చంద్రభాగలో మాఘసప్తమి పుణ్యస్నానం చర్మరోగాల బారి నుంచి ఉపశమనం, పుణ్యఫలం లభిస్తుందని విశ్వాసం. కోవిడ్ ఆంక్షలు తొలగడంతో రెండేళ్ల తర్వాత వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో శనివారం వేకువజాము నుంచే కోణార్క్ చంద్రభాగ తీరం కిటకిటలాడింది. ఘనప్తమి పురస్కరించుకుని చంద్రభాగ తీరంలో భగవంతుడు, భక్తుల అపూర్వ సంగమం తారసపడింది. పరిసర ప్రాంతాల ఆరాధ్య దేవుళ్లను వేకువజామున మేళతాళాలతో ఊరేగింపుగా చంద్రభాగ తీరానికి పల్లకిలో తరలించారు. తీరం చేరిన దేవతాత్రయం తొలుత స్నానం ఆచరించడంతో సాధారణ భక్తులు స్నానాలు చేసేందుకు అనుమతించారు. మాధిపూర్ గ్రామం నుంచి త్రివేణీశ్వర్, సంతపూర్ గ్రామం నుంచి ఈశానేశ్వర్, కురుజంగ్ గ్రామం నుంచి దక్షిణేశ్వర్ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా తీర్థ పుష్కరణికి తీసుకొచ్చారు. ఉదయం 4 గంటలకు చంద్రభాగ తీరంలో మండపానికి దేవతా మూర్తులు చేరాయి. ఈ ముగ్గురు దేవుళ్లస్నానం అనంతరం భక్తులు స్నానాలు చేశారు.

ఉచిత ప్రవేశం..

రథసప్తమి పురస్కరించుకుని కోణార్కు చంద్రభాగ బీచ్‌లో రద్దీ నెలకొంది. తీరం పొడవునా గుడారాలు ఏర్పాటు చేసుకుని రాత్రంతా గడిపిన భక్తులు.. ప్రాతఃకాల స్నానం తర్వాత కోణార్క్ సూర్య ఆలయానికి ప్రదక్షిణ చేసే సంప్రదాయం ఉన్నందున ప్రవేశ రుసుము నుంచి మినహాయింపు ప్రకటించారు. చంద్రభాగ తీరంలో నీటమునక వంటి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఒకేసారి 20వేల మంది స్నానం చేసేందుకు వీలుగా 500 మీటర్ల పొడవు, 200 మీటర్ల వెడల్పు విస్తీర్ణంతో ప్రత్యేక పుష్కరిణి ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలతో ఎన్డీఆర్‌ఎఫ్, ఒడ్రాఫ్, అగ్నిమాపక దళం జవానులను మోహరించారు. తీరంలో ఆకస్మిక విపత్కర పరిస్థితుల నివారణ భద్రతా చర్యల కోసం నియమించారు. ముగ్గురు అదనపు పోలీసు సూపరింటెండెంట్లు, ఐదుగురు డీఎస్పీలు, 15మంది ఇన్‌స్పెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో శాంతి భద్రతల కార్యకలాపాల కోసం 30 ప్లాటూన్ల పోలీసులను నియమించారు.

గోపాల్‌పూర్ తీరంలో

బరంపురం: రథసప్తమి సందర్భంగా నగరానికి సమీపంలోని గోపాల్‌పూర్ తీరంలో సముద్ర స్నానాలతో తీరం పోటెత్తింది. వేలాది మంది నగర ప్రజలు, చుట్టుపక్కల గ్రామస్తులు ఉదయం 4 గంటలకు గోపాల్‌పూర్ చేరుకొని సముద్ర స్నానాలు చేశారు. అనంతరం తీరంలో పాయసం చేసి సాక్షాతు సముద్రం నుంచి సూర్యనారాయణమూర్తి ఉదయిస్తున్న సమయంలో భక్తజనం ప్రత్యేక చేసి, వండిన పాయసం నైవేద్యంగా నివేదించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


రాయగడ: రథసప్తమి పురస్కరించుకుని స్థానిక జగన్నాథ, సంతోషిమాత మందిరాల ప్రాంగణాల్లోని సూర్య మందిరాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర మందిరం 63వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు.

కొత్త బియ్యంతో ప్రసాదం..

పర్లాకిమిడి: పట్టణంలోని రాజవీధి ఉమారామలింగేశ్వర ఆలయంలో సూర్యజయంతి, రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ ప్రధాన పూజారి దుర్గాప్రసాద్ దాస్ పర్యవేక్షణలో సూర్య మందిరం వద్ద కొత్తబియ్యంతో ప్రసాదాన్ని తయారుచేసి భక్తులకు పంచిపెట్టారు. వేకువజాము నుంచే పవిత్ర నదీస్నానాలు చేసి, ప్రత్యక్ష దైవాన్ని దర్శించుకున్నారు.



బరంపురం: తీరంలో సూర్య నమస్కారాలు చేస్తున్న భక్తజనం



కోణార్క్ చంద్రభాగ తీరంలో మాఘమేళ కిటకిట

అర్కాసురునికి ఉప్పుచేప నైవేద్యం..

మాఘమేళాలో ఆసక్తికరమైన ఆచారం తారసపడుతుంది. కోణార్క్ పౌరాణిక పరిచయం అర్క క్షేత్రం. రాక్షసుడైన అర్కాసురుని పేరుతో ఈ క్షేత్రం వెలిసినట్లు పౌరాణిక కథనం. ఈ నేపథ్యంలో అర్కాసురునికి ఉప్పుచేప కలిపి వండిన పప్పు(డల్మా) అన్నం, ఖిచిడీతో కలిపి నివేదించడం ఆశ్చర్యకరంగా తారస పడుతుంది. మాఘమేళా మైదానంలో షష్టి రోజున సాయంత్రం ఈ పదార్థాలను మట్టి కుండల్లో వండి వార్చుతారు. అనంతరం అరటి ఆకులపై అర్కాసురునికి నివేదిస్తారు. మిగిలిన వంటకాన్ని భక్తులు ఆరగిస్తారు. చివరగా మట్టి కుండలను పగులగొట్టి విసిరేస్తారు. ఇలా రువ్వేసిన మట్టి కుండలు స్వల్ప కాలానికి కనుమరుగై పోతాయంటారు.



చంద్రభాగ తీరంలోని గుడారాల్లో భక్తుల బస



రాయగడ: జగన్నాథ మందిరం ప్రాంగణంలోని సూర్యాలయంలో భక్తులు

సాంబునికి కుష్టురోగ విముక్తి

శ్రీకృష్ణుని పుత్రుడు సాంబుడు ఈ తీరంలో స్నానం చేసి కుష్టురోగ పీడ నుంచి విముక్తి పొందినట్లు పౌరాణిక కథనం ప్రచారంలో ఉంది. నారదముని సలహా మేరకు సాంబుడు చంద్రభాగలో స్నానమాచరించి కుష్టురోగం నుంచి విముక్తి పొందాడు. ఈ తీరంలోని అర్కవనంలో 12 ఏళ్లు సుదీర్ఘంగా తపస్సు చేసి, సూర్య భగవానుని అనుగ్రహంతో తనకు వచ్చిన నుంచి విముక్తి పొందడంతో ఈ తీరంలో మాఘసప్తమి పుణ్యస్నానం ప్రాచుర్యం సొంతం చేసుకుంది.



భువనేశ్వర్: తొలిరేడుకి సంధ్యాదీరాధన చేస్తున్న మహిళలు

క్షేత్రస్థాయి నుంచే.. కృషి చేయాలి



మాట్లాడుతున్న యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఇరాసిస్

- బీజేడీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఇరాసిస్ ఆచార్య

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో పార్టీ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయి నుంచే కృషి చేయాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఇరాసిస్ ఆచార్య పిలుపునిచ్చారు. జిల్లాలోని రెండు ఎమ్మెల్యే స్థానాలతో పాటు బరంపురం ఎంపీని కూడా గెలుపించుకునేలా సన్నద్ధం కావాలన్నారు. పర్లాకిమిడి లోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో జిల్లా, మండల స్థాయి నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశం మహేంద్రగిరి పర్వత సందర్శనకు అనుగుణంగా రోడ్డు సదుపాయం మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానిక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో రైతుల ధాన్యం విక్రయాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల మౌలిక సదుపాయలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకంలో ఇళ్ల మంజూరుపై అవినీతి, పక్షపాత ధోరణి నెలకొందని, దీనిపై అధికారులు, రాష్ట్రప్రభుత్వం తగు చర్యలు తీసుకునేలా ఉద్యమించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బలభద్ర మాఝి, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాచరణపై సమాలోచన



స్మృతి పట్నాయక్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక భవనంలో శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు స్మృతి పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు సూచనలించారు. కేంద్రప్రభుత్వ పథకాల అమలు, క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరడంపై వివరాలు సేకరించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను గ్రామాల్లో ఓటర్లకు వివరించాలని సూచించారు. సమావేశంలో బలిమెల ఎన్‌ఏసీ చైర్మన్ ప్రదీప్‌చంద్ర నాయక్, మల్కన్‌గిరి మాజీ చైర్మన్ దశరథి పాడియామి, వివిధ సమితులకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

• కేంద్రం తీరుపై నిరసన



రైతు సమస్యలపై ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

జయపురం: కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు ప్రయోజనాలను కాల రాస్తోందని అఖిల భారత కృషక్ సభ కొరాపుట్ జిల్లా కార్యదర్శి జుధిస్టర రౌళో ధ్వజమెత్తారు. జయపురం బస్టాండ్ వద్ద అఖిల భారత కృషక్ సభ, కొరాపుట్ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల పట్ల కేంద్రప్రభుత్వ విధానాలకు నిరసనగా శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మోదీ సర్కార్ రైతుల ప్రయోజనాలను తుంగలో తొక్కిందని, సాగు చట్టాలతో ప్రజలను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. దీర్ఘకాల ఆందోళనలో వందలాది మంది రైతులు మరణించారని గుర్తుచేశారు. మృతుల కుటుంబాలకు నేటికీ న్యాయం జరగలేదని, అలాగే డిమాండ్లను నేరవేర్చలేదని విమర్శించారు. అత్యవసర వస్తువుల ధరల చట్టం 1955లో సవరణలు రద్దు చేయాలని, ధాన్యాం కొనుగోలు మండీలను వెంటనే పునః ప్రారంభించాలని కోరారు. ఆందోళనలో కొరాపుట్ జిల్లా శాఖ సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, సత్యబ్రత నందో మొదలగు వారు పాల్గున్నారు.

క్లుప్తంగా

వైభవంగా పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

గార: శాలిహుండం కొండపై కాళీయ మర్దన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శనివారం ఉదయం పందిరి రాట నిర్వహించారు. మాఘపౌర్ణమి నాడు కొండపై కల్యాణోత్సవం జరిపిస్తారు. ఆలయ ట్రస్టీ సుగ్గు మధు రెడ్డి దంపతులు, అర్చకులు మహేంద్రాడ వేణుగోపాలశర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ డ్రాయింగ్ ఎగ్జామినేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జేఈఈ మెయిన్స్ డ్రాయింగ్ ఎగ్జామినేషన్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఒకే అన్‌లైన్ సెంటర్‌లో ఒకే షిఫ్టులో ఈ పరీక్ష లు జరిగాయి. 92 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 77 మంది హాజరయ్యారు. సెలవు రోజుల్లో మినహా జేఈఈ పరీక్షలు ఫిబ్రవరి 1 వరకు కొనసాగనున్నాయి.

వందేభారత్ రైలు రూపకర్తతో భేటీ

టెక్కలి: వందేభారత్ రైలు రూపకర్త, ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విశ్రాంత జనరల్ మేనేజర్ సుధాన్షుమణితో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం ఆన్‌లైన్‌లో భేటీ అయ్యారు. ఇంజినీరింగ్ కెరియర్ ఇన్నోవేషన్ ఫర్ ఆత్మనిర్భర్ భారత్ అనే అంశంపై కళాశాలకు చెందిన కెరీర్ గైడెన్స్, మెకానికల్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులంతా సుధాన్షుమణితో ఆన్‌లైన్‌లో చర్చించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వర రావు తెలిపారు. రైలు రూపకల్పనలో చేపట్టిన అంశాలను తెలియజేశారని పేర్కొన్నారు.

నేడు సాఫ్ట్‌టెన్నిస్ జట్టు ఎంపిక

పాతపట్నం: జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జిల్లా సీనియర్ జట్టు ఎంపికలు ఆదివారం నిర్వహించనున్నట్లు సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి.అప్పన్న, జె.షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం మండలం కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని టెన్నిస్ కోర్టులో ఉదయం పది గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో కడప మున్సిపల్ స్టేడియంలో జరిగే అంతర్రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

షిర్డీసాయి ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం

గార: మండలంలోని అంబళ్లవలస షిర్డీసాయి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. ఆలయం ప్రధాన తలుపుల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు సుమారు కేజీ 250 గ్రాముల వెండి వస్తువులను పట్టుకెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా క్లూస్‌టీం పరిశీలించింది. ఏఎస్.ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపరాలను ముంచేస్తున్న మంచు



సిద్ధాంతం ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న మంచు

ఎల్.ఎన్.పేట: మంచుతాకిడి అధికమైంది. రెండు వారాలుగా వేకువజాము నుంచి ఉదయం 8 గంటల వరకు విపరీతంగా మంచు కురుస్తోంది. రాత్రివేళ చలితీవ్రత పెరిగింది. మంచు కారణంగా అపరాల పంటలతో పాటు జీడి, మామిడి పూతకు నష్టం జరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్ లారీ పట్టివేత

టెక్కలి: టెక్కలి సమీపంలో శనివారం లారీలో అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ బ్లాకులను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. నీలాపురం సమీపంలో కార్తీక్ గ్రానైట్స్‌కు చెందిన రెండు గ్రానైట్ బ్లాకులను లారీలో అక్రమంగా తరలిస్తూ జాతీ య రహదారిపై పార్కింగ్ చేయగా అదే దారిలో వస్తు న్న విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించి అక్ర మంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. అనంతరం లారీని టెక్కలి పోలీ స్‌స్టేషన్‌కు తరలించారు.

జర్జంగిలో పట్టపగలే చోరీ

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి శివాలయంవీధికి చెందిన మునగవలస సావిత్రి ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి పావుతులం బంగారం, 20 గ్రాముల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. సావిత్రి శుక్రవారం తన ఇంటికి తాళం వేసి స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు వెళ్లిన సమయంలో ఈ చోరీ జరిగింది. ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ లక్ష్మణ శనివారం తెలిపారు.

న్యాయ పరిశోధనలకు పట్టుగొమ్మ



హైకోర్టు ఉద్యోగుల రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

- జ్యుడీషియల్ రికార్డుల భద్రత కేంద్రానికి శంకుస్థాపన చేసిన సీఎం నవీన్
- రూ.34 కోట్ల అంచనాతో నిర్మాణానికి నిధులు మంజూరు

భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టు ఉద్యోగుల కోసం రెసిడెన్షియల్ కాంప్లెక్స్, సెంటర్ ఫర్ జ్యుడీషియల్ ఆర్కైవ్స్(రికార్డుల డిజిటల్ భద్రత) భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం శంకుస్థాపన చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వినిత్ శరణ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ ఎస్.మురళీధర్, ఇతర న్యాయమూర్తులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ రెండు ప్రాజెక్టుల్లో జ్యుడీషియల్ ఆర్కైవ్ భవనం నిర్మాణానికి రూ.34 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో 200 ఏళ్ల నాటి ప్రాచీన న్యాయ సంబంధిత దస్తావేజులను డిజిటలరూపంలో భద్ర పరచనున్నట్లు ప్రకటించారు. న్యాయ సంబంధిత పరిశోధనలకు ఇవి పట్టుగొమ్మ వంటివని అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశ స్వాతంత్ర్యానికి ముందు మనుగడ పొందిన ప్రాచీన పత్రాలు సైతం ఇక్కడ లభ్యమవుతాయన్నారు. ప్రధానంగా నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు జానకీనాథ్ బోస్, ఉత్కళ్ గౌరవ్ మధుసూదన్ దాస్, ఉత్కళమణి గోపబంధు దాస్ వంటి రాష్ట్రంలో అనేక మంది ప్రముఖుల న్యాయవాద సంబంధిత పత్రాలు ఈ కేంద్రంలో లభిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర అధికారులకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సంస్థ పరిశోధనలకు, చరిత్రకు అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శంకుస్థాపన చేసిన రెండు ప్రాజెక్టుల డిజైన్లను ప్రదర్శించారు. జ్యుడీషియల్ ఆర్కైవ్ భవనంలో ఒడిశాలోని న్యాయపరమైన, ఇతర విలువైన జ్ఞాపకాలు ఉంటాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధర్ తెలియజేశారు.

రాష్ట్ర ప్రయోజనాలే అజెండా..

- బడ్జెట్ సమావేశాల్లో బీజేడీ వ్యూహంపై కసరత్తు



తన నివాసంలో పార్టీ ఎంపీలతో సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఒడిశా ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిన అంశాలను ప్రస్తావించాలని బిజూ జనతాదళ్ పార్లమెంట్ సభ్యులకు పార్టీ అధ్యక్షుడు, సీఎం నవీన్ పట్నాయక్ సూచించారు. ఈ మేరకు నవీన్ నివాస్‌లో పార్టీ ఎంపీల సమావేశం శనివారం నిర్వహించారు. ఈనెల 31నుంచి ప్రారంభం కానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని పార్టీ ఎంపీల కార్యాచరణ వ్యూహాన్ని వివరించారు. దీర్ఘకాలంగా ఊగిసలాడుతున్న రాష్ట్ర ప్రయోజనాల ప్రతిపాదనల పట్ల లోక్‌సభ, రాజ్యసభలో ఎంపీలు ఒత్తిడి తేవాలని ఉద్బోధించారు.

ప్రధాన డిమాండ్లు..

ఒడిశాకు ప్రత్యేక రాష్ట్ర హోదా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల మంజూరు, షెడ్యూల్డ్ తెగల జాబితాలో 169 వర్గాలకు గుర్తింపు, మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం వంటి కీలక అంశాలుగా బీజేడీ ఎంపీలు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని ఉభయ సభల్లో ప్రస్తావించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రకృతి వైపరీత్యాల ప్రత్యేక సహాయం పట్ల కేంద్రం వైఖరి స్పష్టత, రాజ్యాంగ పీఠికలో అహింస నిర్వచనం జోడించడం, వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమం ప్రధాన అంశాలపై బడ్జెట్ సమావేశాల్లో ఉద్యమించేందుకు సిద్ధమయ్యారు.

సమావేశాల షెడ్యూల్..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 31 నుంచి ప్రారంభమై, ఏప్రిల్ 6వరకు కొనసాగుతాయి. ఈ సమావేశాలను 66 పనిదినాల్లో 27 సిటింగ్స్‌లతో నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఇందులో కేంద్రప్రభుత్వ 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న సభలో ప్రవేశ పెట్టనున్నారు.

వైవిధ్య సాంకేతికతో ముందుకు సాగాలి

- సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఎల్ఎం పట్నాయక్



ప్రతిభావంతులకు పతకం ప్రదానం చేస్తున్న సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఎల్ఎం పట్నాయక్



ప్రసంగిస్తున్న ఐఐటీ డైరెక్టర్ శ్రీపాద కర్మాల్కర్



స్నాతకోత్సవంలో ఐఐటీ ఉత్తీర్ణుల ఉత్సాహం

భువనేశ్వర్: వైవిధ్య సాంకేతిక పరిజ్ఞానంతో సాంకేతిక వైజ్ఞానిక రంగంలో దేశాన్ని అత్యంత శక్తివంతమైనదిగా మలచాలని సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఎల్ఎం పట్నాయక్ పిలుపునిచ్చారు. భువనేశ్వర్‌లోని భారతీయ సాంకేతిక సంస్థ(ఐఐటీ) 11వ కన్వొకేషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. సైన్స్, టెక్నాలజీ విద్యాభ్యాసం, పరిశోధన రంగాల్లో ప్రపంచస్థాయి ప్రామాణికాలతో ఐఐటీ అగ్రగామిగా కొనసాగుతోందని కొనియాడారు. పారిశ్రామిక రంగం అనుబంధ పరిశోధనాత్మక విద్యాభ్యాసం ఉత్తీర్ణులకు బంగారు భవిష్యతు ప్రదానం చేస్తోందని ఉత్సాహపరిచారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన నాణ్యమైన విద్యా బోధనతో ఈ సంస్థ యువ మేధావులను ఆవిష్కరిస్తోందని ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద కర్మాల్కర్ తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌పీ సింఘ్ వర్చువల్ మాధ్యమంలో పాలుపంచుకుని ఉత్తీర్ణులకు అభినందించారు. ఈ సందర్భంగా 55 పీహెచ్‌డీ, 671 మంది గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులు అతిథుల చేతుల మీదుగా పట్టాలు అందుకున్నారు. వీరిలో 172మంది ఎంటెక్, 90మంది ఎంఎస్సీ, 81మంది డ్యూయల్ డిగ్రీలు, 273మంది బీటెక్ ఉత్తీర్ణులు ఉన్నారు.

ప్రతిభకు పతకం..

కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు పతకాలను ప్రదానం చేశారు. 2018 బ్యాచ్‌కు చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థి షారాజ్ కల్పేష్‌భాయ్ భారత రాష్ట్రపతి బంగారు పతకాన్ని సాధించారు. అదే విభాగం 2017 బ్యాచ్ అభ్యర్థి ఎస్.ప్రసాద్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో డైరెక్టర్ బంగారు పతకం సొంతం చేసుకున్నారు. ఎర్త్, ఓషన్ అండ్ క్లైమెట్ సైన్సెస్ విద్యార్థి ప్రీతమ్‌కుమార్(2018 బ్యాచ్), ఎంటెక్ కోర్సులో స్మరణ్ మాఝి ఉత్తీర్ణత సాధించి, మేధావుల జాబితాలో చోటు చేసుకున్నారు.

వంశధారకు.. వసంతోత్సాహం

- కలశయాత్రలో పాల్గొన్న రాజకీయ ప్రముఖులు
- గుణుపూర్‌కు తరలివచ్చిన జనసందోహం



కలశాన్ని ఉత్సవ వేదికకు తీసుకువస్తున్న మంత్రి జగన్నాథ సరక



కర్రసాము చేస్తున్న ఔత్సాహికుడు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో వంశధార వసంతోత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జగన్నాథ మందిరం నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహించి, సమీపంలోని వంశధార నది నుంచి సేకరించిన పవిత్ర జలాలను కలశాలలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చేపట్టిన కలశయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. జగన్నాథ మందిరం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఉత్సవాలు నిర్వహించే కపిల్‌పూర్ వేదిక వరకు కొనసాగింది. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో మహిళలు స్వాగతం పలకగా.. ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక కలశాన్ని మోసుకుంటూ యాత్రలో పాల్గొన్నారు. గుణుపూర్‌కు సమీపంలోని పుట్టాసింగికి చెందిన లంజియా సవర గిరిజనులు వారి సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ ఇందులో భాగంగా యువకుల కర్రసాము, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారుల తప్పెటగుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నెక్కంటికి ప్రత్యేక ఆహ్వానం

రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావుకు ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. గుణుపూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మమత గౌడొ, ఉపాధ్యక్షుడు శివప్రసాద్ గౌడొ, సమితి చైర్మన్ ఝిల్లి సొబోరా ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం నెక్కంటి యాత్రలో పాల్గొన్నారు.

ఉత్సవాల్లో రాజకీయ ప్రముఖులు

వంశధార వసంతోత్సవాల్లో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) చైర్‌పర్సన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బిజూ స్వాస్థ్య సమితి ముఖ్యసలహాదారుడు సు. దీర్‌దాస్ తదితర రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



లంజియా సవర సంప్రదాయ నృత్యాలు



కలశయాత్రకు తరలివచ్చిన జనం

కళలకు పుట్టినిల్లు గంజాం

- రాష్ట్ర కార్మిక శాఖామంత్రి శ్రీకాంత్ సాహూ
- ముగిసిన బుద్ధకులో మహోత్సవాలు



ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న మంత్రి శ్రీకాంత్ సాహు



ఉత్సవాల్లో కిక్కిరిసిన జనసందోహం

బరంపురం: కళలకు పుట్టినిల్లుగా గంజాం జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందిందని రాష్ట్ర కార్మిక శాఖామంత్రి శ్రీకాంత్ సాహు పేర్కొన్నారు. గంజాం జిల్లా పులసరా బ్లాక్ క్రీడా మైదానంలో గత 3 రోజులుగా జరుగుతున్న బుద్ధకులో మహోత్సవాలు వైభవంగా ముగిసాయి. శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాష జాతిని గుర్తిస్తే.. సంస్కృతి, సంప్రదాయాలు దేశాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని గుర్తుచేశారు. అనంతరం స్థానిక కళాకారులు ప్రభు జగన్నాథ్ దేవత విగ్రహం వద్ద ఒడిస్సీ నృత్యంతో భక్తిగీతాన్ని ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు చేసిన సంబల్‌పూరీ నృత్యం, భరతనాట్యం అతిథులు, సందర్శకులను మైమరపింపజేశాయి. ఇందులో భాగంగా కళాకారులను ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో బరంపురం ఎమ్మెల్యే విక్రమ్‌పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పాదుకా దర్శనం.. పరమ పావనం



బాబా పాదుకలు



బాబా పాదుకలకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

- ఖుర్దారోడ్‌లో భక్తిశ్రద్ధలతో షిర్డీసాయి పాదుకల దర్శనం

భువనేశ్వర్: షిర్డీసాయి పాదుకల దర్శనంతో భక్తజనం పరవశించింది. ఖుర్దారోడ్ ట్రాఫిక్ కాలనీ లోని శ్రీసాయి జగన్నాథ్ ఆలయ ప్రాంగణంలో బాబా పాదుక పూజోత్సవం గత 2 రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. షిర్డీ నుంచి సాయి బాబా వినియోగించిన పాదుకలను ఈ ఉత్సవంలో భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేశారు. వరుసగా మూడో ఏడాది ఈ ప్రాంగణంలో సాయి పాదుక పూజ నిర్వహించడం విశేషం. భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, బీజేపీ నాయకులు మన్మథ రౌత్రాయ్, మాజీ ఎమ్మెల్యే బిభూతి భూషణ్ బల్వంత్రాయ్, పలువురు కార్పొరేటర్లు ప్రాంగణంలోని సాయి పాదుకలను దర్శించుకున్నారు. ఉత్సవం ఆద్యంతాలు నిర్వహించిన భజన సంధ్య కార్యక్రమంతో పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతవరణం నెలకొంది.

భక్తుల కోరిక మేరకు..

నానాసాహెబ్ నిమన్‌కర్ సాక్షాతు షిర్డీసాయికి పాదుకలను బహూకరించినట్లు ఆయన వంశీకుల కథనం. 1898 నుంచి ఈ పాదుకలను వంశీకుల పూజాదులతో నియమ నిష్టలతో పరిరక్షిస్తున్నారు. భక్తుల అభ్యర్థన మేరకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సాధారణ భక్తుల దర్శనం కోసం ప్రదర్శిస్తున్నట్లు నిమన్‌కర్ వంశీకుడు(5వ తరం) నందకుమార్ నిమన్‌కర్ తెలిపారు. బాబా ఆదేశాల మేరకు షిర్డీ ద్వారకామయి ఆలయ శిఖరాన నానాసాహెబ్ నిమన్‌కర్ పేరుతో పతాకం రెపరెపలాడుతోంది. ఏటా శ్రీరామ నవమి పురస్కరించుకుని ఆలయ శిఖరాన నానాసాహెబ్ నిమన్‌కర్ పతాకం ఏర్పాటు చేస్తారు. ఏడాది పొడవునా ఈ పతాకం ద్వారకామయి ఆలయ శిఖరాన రెపరెపలాడటం భక్తుల పాలిట బాబా కరుణకు నిలువెత్తు తార్కాణంగా పేర్కొన్నారు. షిర్డీసాయి సంప్రదాయంలో నిమన్‌కర్ పతాకం ఏర్పాటు పరంపరగా కొనసాగుతోందని వివరించారు.

భజన సంధ్య..

పాదుక ఉత్సవంలో భాగంగా రోజూ సాయంత్రం వేళ భజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి యథాతథంగా నిత్య సేవాదులతో ఉత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల పర్యవేక్షణలో ప్రత్యేక హోమాదులు జరిపించారు. తిరుపతి పండా ప్రత్యక్ష పర్యవేక్షణలలో జలయాత్ర, వరుణ, వాస్తు, పంచదేవత, సూర్యపూజ, ధేను పూజలు నిర్వహించారు. ప్రధానకర్తలుగా పాల్గొన్న కాలూచరణ్ బెహరా దంపతులతో సాధారణ భక్తులు విశేష సంఖ్యలో పాలుపంచుకున్నారు. ఆలయ పుష్కరోత్సవం పురస్కరించుకుని 2012లో తొలిసారిగా షిర్డీసాయి పాదుకల ఉత్సవం నిర్వహించినట్లు సమన్వయకర్త సునీల్‌కుమార్ పరిడా తెలిపారు.

క్లుప్తంగా

అటవీశాఖ అధికారిపై దాడి

కొమరాడ: గజరాజుల సంచారం నేపథ్యంలో మండలంలోని వన్నాం గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్న అటవీ శాఖ బీట్ ఆఫీసర్ సత్యనారాయణపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం దాడికి పాల్పడ్డారు. బాధిత ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వన్నాం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జగదీష్ నాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

గజపతినగరం రూరల్: మోటార్‌బైక్ ఢీకొనడంతో వృద్ధురాలు ఎర్ర.పైడమ్మ(67) దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని ముచ్చర్ల గ్రామం ప్రధాన రోడ్డులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డు దాటే క్రమంలో వేమలి నుంచి గజపతినగరం వైపు బైక్‌తో వస్తున్న యువకుడు సుంకరి పైడిరాజు ఆమెను ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


ఆస్పత్రిలో దేవి మృతదేహం

గజపతినగరం రూరల్: పురుగుమందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు లోనై విజయనగరం ఎం.ఆర్.ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత లోగిశ దేవి(37) శనివారం మృతి చెందింది. మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన దేవి తన పిల్లలు చెప్పిన మాట వినడం లేదన్న మనస్తాపంతో వారిని బెదిరించి, సన్మార్గంలో నడిపేందుకు ఈ నెల 25వ తేదీన పురుగుమందు తాగింది. చికిత్స నిమిత్తం ఆమెను తొలుత గజపతినగరం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఎం.ఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతుండగా ఆమె మరణించినట్లు గజపతినగరం ఎస్ఐ గంగరాజు పేర్కొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుర్ల: పురుగుమందు తాగి దేవా సన్యాసిరావు(52) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గుజ్జింగివలస గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అతడు బాధను తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పిడినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు


ఘటన స్థలంలో క్షతగాత్రులు

పార్వతీపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని జోగింపేట వద్ద శనివారం జరిగింది. పార్వతీపురం ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రాయగడకు చెందిన గుడుపూరు అప్పలనాయుడు లోచర్ల గ్రామం నుంచి సీతానగరం మీదుగా పార్వతీపురం పట్టణానికి స్కూటీపై వస్తున్నాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి సీతానగరం వైపు మోటార్‌బైక్‌పై వస్తున్న బి.స్వామినాయుడు జోగింపేట వద్ద ఒకరినొకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు ఎడమకాలు, తల వెనక భాగం, మోకాలిపై గాయాలు కాగా, స్వామినాయుడుకు కూడా శరీరంలోని పలుచోట్ల గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

యల్లారమ్మ జాతర తేదీలు ఖరారు

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ జాతర ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాలకులు, దేవదాయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. దేవదాయ అధికారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేదపండితులు మావూడూరి భానుమూర్తి జాతర ముహూర్తాన్ని శనివారం ఖరారు చేశారు. స్థానిక మూడు కోవెళ్లలో గ్రామ పెద్దలతో పాలకులు, దేవదాయ అధికారులు ,ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై ముహూర్తం ఖరారు చేశారు. ఫిబ్రవరి 26న తొలేళ్లు, 27న జాతర, 28న చిన్నతీర్థం నిర్వహించడానికి ఖరారు చేశారు. తొలేళ్లు రోజు ఆదివారం రాత్రి అమ్మవారిని 10.45 గంటలకు అమ్మవారిని గద్దె దింపి తెల్లవారుజామున 2.30 నుంచి 3.30 గంటల మధ్య అమ్మవారి ఆలయ ప్రవేశం జరిపించడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ ఎం.ప్రసాదరావు, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ, గ్రామ పెద్దలు అల్లు సత్యాజీ, వాక అప్పారావు, నెక్కల రమణ, వర్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం సత్తా

- కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఆతిథ్య జట్టు
- విజేత జట్లకు అభినందనల వెల్లువ


కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్న ఆతిథ్య విజయనగరం జట్టు


ఆహ్వానపు ఖోఖో పోటీల్లో విజేతగా నిలిచిన విజయనగరం జట్టు

విజయనగరం: విజయనగరం వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆహ్వానపు క్రీడా పోటీల్లో ఆతిథ్య విజయనగరం జిల్లా జట్టు సత్తాచాటింది. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో కంచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో క్రీడల్లో విజయనగరం ప్రథమ స్థానం కైవసం చేసుకుని, విద్యలనగరం కీర్తి ప్రతిష్ఠలు నలుమూలలకు చాటింది. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగిన ఈ పోటీల్లో ఖోఖో క్రీడాపోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొనగా, విజయనగరం జట్టు ప్రథమ స్థానం, ప్రకాశం జిల్లా జట్టు ద్వితీయ స్థానం, విశాఖ జిల్లా జట్టు తృతీయ స్థానం, తూర్పుగోదావరి జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. అలాగే కబడ్డీ క్రీడాపోటీల్లో 10 జట్లు పాల్గొనగా, విజయనగరం జట్టు ప్రథమ స్థానం, నెల్లిమర్ల జట్టు ద్వితీయ స్థానం, అలుగోలు జట్టు తృతీయ స్థానం, విశాఖ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఆయా క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, కంచర్ల ఫౌండేషన్ ప్రతినిధి కుమార్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందజేశారు. విజేత జట్ల సభ్యులకు పలువురు ప్రముఖులు, స్థానికులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కాళ్ల సూరిబాబు, పతివాడ శ్రీనివాసరావు, బొమ్మన రామారావు, రంగారావు దొర, కమలనాభరావు, జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు పి.చిన్నంనాయుడు, సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తౌడుబాబు, సూర్యారావు, గోపాల్, కె.ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

మిల్లెట్ ప్రోసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలి

- జిల్లా స్థాయి పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి


సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు


మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: మిల్లెట్ ప్రోసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరైన ఆమె పరిశ్రమల స్థాపనకు ఇప్పటివరకు అందిన దరఖాస్తులను నెలరోజుల్లోగా గ్రౌండింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యాన, మత్స్య శాఖల ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు యువతకు అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పాపారావు మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం 2022 అక్టోబర్ నుంచి 2023 జనవరి వరకు మొత్తం 104 దరఖాస్తులు అందగా, వాటిలో 82 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. కాలుష్య నియంత్రణ శాఖ వద్ద మరో 19 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, 3 దరఖాస్తులు తిరస్కరించడం జరిగిందన్నారు. స్పందించిన కలెక్టర్ దరఖాస్తులను నేరుగా తిరస్కరించవద్దని, దరఖాస్తుల్లో ఏవైనా లోపాలుంటే వాటిని సవరించి తిరిగి సమర్పించమన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 35 నుంచి 45 శాతం సబ్సిడీ ఉంటుందని, దీనిపై అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించాలన్నారు.

లైసెన్స్‌లు రద్దు చేయండి..

వినియోగదారులకు కనీస భద్రత ఉందా లేదా అనే విషయం నిర్ధారణకు షాపింగ్ మాల్స్, దుకాణాల్లో తనిఖీలు చేసి, నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను కోరారు. అగ్నిమాపక, లేబర్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేయాలని సూచించారు. ఎంట్రీ, ఎగ్జిట్‌ల ద్వారాలు వేర్వేరుగా ఉండాలని, ఫైర్ సామగ్రి, అత్యవసర ద్వారాలు ఉన్నాయా లేదా అని చూడాలన్నారు. నిబంధనలు పాటించని వారి లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీ ఐఐసీ సంస్థ ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ పే చేస్తానని నగదు పట్టుకుపోయిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరావు(వెనక నిందితుడు అప్పలస్వామి)

విజయనగరం క్రైమ్: ఫోన్ పే చేస్తానని నగదు పట్టుకుపోయిన వ్యక్తిని విజయనగరం వన్‌టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన పి.వి.వి.సత్యనారాయణ ఈ నెల 19వ తేదీన ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ దగ్గర డబ్బులు విత్‌డ్రా చేసుకునే క్రమంలో అక్కడికి వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి తనకు అత్యవసరంగా రూ.10 వేలు క్యాష్ కావాలని ఫోన్ పే చేస్తానని నమ్మబలికాడు. అతడి మాయమాటలు నమ్మిన సత్యనారాయణ అతడి చేతికి రూ.10 వేలు అందించారు. సదరు వ్యక్తి ఫోన్ పే చేసినట్లుగానే చేసి, తప్పుడు మెసేజ్ చూపించి పరారయ్యాడు. తాను మోసపోయిన సంగతి తెలుసుకున్న బాధితుడు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న పోలీసులు కోట జంక్షన్ వద్ద అనుమానాస్పదగా తిరుగుతున్న నెల్లిమర్లకు చెందిన బండారు అప్పలస్వామి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, తానే నేరం చేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి, రూ.8 వేలు రికవరీ చేసినట్లు సీఐ వెంకటరావు తెలిపారు. ఈ కేసు ఛేదనలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్ఐ వి.అశోక్‌కుమార్, ఏఎస్ఐ రాజు, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుల్స్ టి.శ్రీనివాసరావు, పి.శివశంకర్‌లను అభినందించారు.

తైక్వాండో పోటీలకు 40 మంది ఎంపిక

బొబ్బిలి: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి నుంచి 40 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఈ మేరకు ఎంపికైన వారిని స్థానికులు అభినందించారు.

నిందితుడికి వారం రోజుల జైలు

కురుపాం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలోని నిందితుడికి వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి ఇ.ఆంజనేయులు శుక్రవారం తీర్పు వెల్లడించారు. మండలంలోని భూర్జమానుగూడకు చెందిన నిందితుడు బిడ్డిక శ్రీను బైక్ నడుపుతూ రోడ్డు ప్రమాదానికి కారకుడయ్యాడు. అతడికి లైసెన్స్ లేదని నిర్ధారించిన న్యాయమూర్తి వారం రోజుల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు నగదు జరిమానా కూడా విధించినట్లు సమాచారం.

'మత్తు'తో జీవితాలు చిత్తు


అవగాహన కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ పోలీసులు

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని, యువత అంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఎస్ఐ సుస్మిత, సిబ్బందితో కలిసి మాదక ద్రవ్యాలు వినియోగించవద్దని కోరుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైనీ, గుట్కా, సిగరెట్, గంజాయి, కొకైన్, హెరాయిన్ మత్తు పదార్థాలు వినియోగించవద్దని తెలిపారు. వాటి వినియోగం వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు ఎంతోమంది క్యాన్సర్ బారినపడి చనిపోతున్నారని వారిని నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. రైళ్లలో ప్రయాణించే వారంతా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేయవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చిన వస్తువులు, కానీ తినుబండారాలు కానీ తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాయుడు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ ఎస్‌డీవీ రమణ


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రమణ

పార్వతీపురం: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా సిబ్బంది కృషి చేయాలని డీఈఓ ఎస్‌డీవీ రమణ సూచించారు. శనివారం స్థానిక పట్టణంలో పార్వతీపురం డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన పరీక్షలంటే భయం పోగొట్టేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పరీక్షల సమయంలో మాల్‌ప్రాక్టీస్, చూసిరాతలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పాఠశాలలను సందర్శించే సమయంలో ప్రతీ పాఠశాలకు సంబంధించిన ప్రతీ అంశంపై సంబంధిత రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు నిందితుడి తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పలనాయుడు

గజపతినగరం: గంజాయి తరలింపు కేసులో పట్టుబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు వెల్లడించారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంల ఆవరణలో విలేకరులతో మాట్లాడిన ఆయన శుక్రవారం సాయంత్రం మానాపురం రైల్వేగేటు సమీపంలో గజపతినగరం ఎస్ఐ గంగరాజు, డీటీ, ఇతర పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా, మెరకముడిదాం మండలంలోని గేదెల మర్రివలస గ్రామానికి చెందిన వలిరెడ్డి సత్యనారాయణ అలియాస్ శివ ద్విచక్ర వాహనంపై 4.7 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డాడని తెలిపారు. గతేడాది నుంచి విశాఖపట్నంలోని ఓ కంపెనీలో ఆయిల్ పెయింటర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణకు అక్కడే ఒడిశా రాష్ట్రానికి చెందిన రమేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి గంజాయి సేవించడం మొదలుపెట్టాడని, ఈ క్రమంలోనే గంజాయి వ్యాపారానికి కూడా సిద్ధమైనట్లు తెలిసిందని సీఐ అన్నారు. నిందితుడి నుంచి ఓ ద్విచక్ర వాహనంతో పాటు సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

పాశ్చాత్య పోకడలతో ఉమ్మడి కుటుంబం చిన్నాభిన్నం

- న్యాయ అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి


ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి



టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న న్యాయమూర్తులు

విజయనగరం లీగల్: డబ్బు, పాశ్చాత్య పోకడల ప్రభావంతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని, దీంతో సమాజంలో విలువలు రోజురోజుకూ పతనమైపోతున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్సా మాడ్యూల్ మెగా న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పిల్లల్లో నైతిక విలువలు కొరవడుతున్నాయని దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న దుష్పరిణామాలు తగ్గాలంటే పటిష్ఠమైన కుటుంబ వ్యవస్థ ఏర్పాటు జరగాలన్నారు. డబ్బు సంపాదన, ఆస్తులు కూడబెట్టడమే ప్రధానంగా చాలామంది జీవిస్తున్నారని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. పిల్లలపై పర్యవేక్షణ లోపం ఉండడం వల్లే వారిలో నైతిక విలువలు కొరవడుతున్నాయన్నారు. పిల్లలను పెంచే విధానంలో, చదువు చెప్పే విధానంలో మార్పు రావాలని హితవు పలికారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజహితమే లక్ష్యంగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. మనం ఎంత డబ్బు సంపాదించినా మనకంటూ కొంతమంది ఆప్తులను అయినా సంపాదించుకోలేకపోతే ఆ జీవితం వ్యర్థమన్నారు. కర్మ సిద్ధాంతానికి లోబడి అందరూ ఉండాల్సిందేనని, దానిని కాదని తప్పులు చేస్తే జీవిత చరమాంకంలో దాని ఫలితాలు అనుభవించక తప్పదన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకోవాలి..

జిల్లా కోర్టు ఒకటో అదనపు న్యాయమూర్తి కె.రాధారత్నం మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. మన చుట్టూ ఉండేవాళ్లలోనే మనకు శత్రువులు ఉంటున్నారని అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రేమ అనే ఉచ్చులో పడి పిల్లలు వారి భవిష్యత్తును వారే నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లా కోర్టు నాలుగో అదనపు న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా మాట్లాడుతూ సమాజ స్థితిగతులను అర్థం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ జీవించాలన్నారు. గిఫ్ట్ డీడ్‌లు రాసేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. రివర్స్ మార్ట్ గేజ్ విధాన సౌలభ్యాన్ని వినియోగించుకుని వృద్ధులు లబ్ధి పొందవచ్చన్నారు. దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ లక్ష్మి మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే 8977945606 ఫోన్ నంబరును సంప్రదించి, సాయం పొందవచ్చన్నారు. ఎల్డర్ లైన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ వృద్ధుల సౌకర్యార్థం 14567 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఎటువంటి సహాయం కావాలన్నా టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం సంబంధిత పోస్టర్‌ను న్యాయమూర్తులు ప్రారంభించారు. మెగా న్యాయ అవగాహన సదస్సులో భాగంగా న్యాయసేవా సదన్ భవనంలో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ, మెప్మా, సమాఖ్య సభ్యులు తయారు చేసిన వస్తువులు, చేనేత వస్త్రాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జగదీష్ బాబు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ హిమబిందు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జగదీష్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.హెచ్.వి.లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం లభ్యం


సంఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం-జమ్మాదేవిపేట ప్రాంతాల మధ్య ఉన్న కిరండోల్ రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని 28 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన డీఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సింహాద్రినాయుడు, జీఆర్‌పీ సీఐ వెంకటరావు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రైల్వేట్రాక్‌కు అత్యంత సమీపంలోని అరకు-విశాఖ రోడ్డు అంచున రక్తపు మరకలు, అక్కడి నుంచి మృతదేహాన్ని ఈడ్చుకుంటూ వెళ్లినట్లు ఉన్న ఆనవాళ్లను గుర్తించారు. ఈ క్రమంలో విజయనగరం నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి మరీ దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. యువకుడిని ఎవరో కావాలనే చంపి, రైల్వేట్రాక్‌పై పడేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తలభాగం పూర్తిగా నుజ్జునుజ్జుకావడంతో ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఆ వ్యక్తి ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇదే ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ రవివర్మ తెలిపారు.

విశాఖ నుంచి సినిమా ఫీల్డ్‌కు వెళ్లా..


మాట్లాడుతున్న సినీహీరో సందీప్


షూటింగ్‌లో పాల్గొన్న చిత్ర యూనిట్

బొబ్బిలి రూరల్: విశాఖ నుంచి సినిమా ఫీల్డ్‌కు వెళ్లానని సినీ హీరో సందీప్(దీపు) తెలిపారు. శనివారం స్థానిక గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న తాను మంచి సినిమాల్లో నటిస్తున్నానని అన్నారు. హామీ, ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు సినిమాల్లో నటించానని, మూడో సినిమా శ్రీసిద్ధి వినాయక మూవీ మేకర్స్‌లో నటిస్తున్నానని వెల్లడించారు. ప్రస్తుతం తాను నటిస్తున్న ఈ సినిమా హీరోయిన్ ప్రాధాన్యత ఉన్న సినిమా అని అన్నారు. ప్రతిభ ఉన్న వారికి ఎప్పుడూ సినీ ఇండస్ట్రీలో చోటుంటుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి సినిమా ప్రాజెక్ట్‌లలో నటిస్తానన్నారు.

బొబ్బిలిలో సినిమా షూటింగ్

బొబ్బిలి రూరల్: స్థానిక పట్టణంలోని గెస్ట్‌హౌస్‌లో శ్రీసిద్ధివినాయక మూవీ మేకర్స్ ప్రొడక్షన్ నంబర్-1 సినిమా షూటింగ్ శనివారం ప్రారంభమైంది. సందీప్(దీపు), సాయి ధనిష్క హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో హీరోయిన్ ఓరియంటెడ్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రానికి దర్శకుడు ఎ.అభిరామ్, కో-డైరెక్టర్ బండి రమేష్ కాగా నటులు గణేష్, వెంకటరామన్, సత్యప్రకాష్, విమలారామన్, అమిత్ తివారీ, నాగమహేష్, చిత్రం శ్రీను నటిస్తున్నారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇదే ప్రాంతంలో షూటింగ్ జరుగుతుందని డైరెక్టర్ అభిరామ్ తెలిపారు. హీరోయిన్ చేసే పోరాటాలు, యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాకు ప్లస్ అవుతాయన్నారు. తొలిరోజు షూటింగ్‌లో కోర్టు సీన్ షూట్ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తూముల భాస్కరరావు, టీడీపీ నేత బేబి నాయనా తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి పందిరిరాట


తూర్పు రాజగోపురం వద్ద పందిరిరాటను వేస్తున్న అర్చకులు

- శాస్త్రోక్తంగా జరిపించిన అర్చకులు
- రామతీర్థానికి రథసప్తమి శోభ
- దేవాలయానికి చేరుకున్న రాములోరి రథం


స్వామివారి వెండి మండపం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామివారి దేవస్థానంలో ఫిబ్రవరి 1న జరగబోయే స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవం సందర్భంగా తూర్పు రాజ గోపురం వద్ద శనివారం పందిరిరాట కార్యక్రమాన్ని అర్చకులు వేడుకగా జరిపించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పందిరిరాట మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్వామివారికి వేకువజామున సుప్రభాతసేవ, బాలభోగం అయిన తరువాత రామస్వామివారి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యాహావచనం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్ద పందిరిరాటను వేశారు. అనంతరం వెండి మండపం వద్ద శ్రీరాముడిని పెళ్లి కుమారుడిగా తయారు చేసి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు మాట్లాడుతూ ఫిబ్రవరి 1న స్వామివారి సన్నిధిలో వార్షిక కల్యాణ మహోత్సవాలను జరిపిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రథసప్తమి రోజున పందిరిరాట మహోత్సవానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వచ్చే నెల 1న రాత్రి 9.30 గంటలకు శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్నట్లు వెల్లడించారు. అదే రోజున స్వామివారి మూడు వాహనాల సేవ, ఎదురు సన్నాహ మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు.

ఆలయం వద్దకు రాములోరి రథం

ఫిబ్రవరి 4న రాత్రి 10 గంటలకు రథయాత్ర మహోత్సవం జరగనుంది. ఏటా ఆనవాయితీగా సీతారామునిపేట గ్రామానికి చెందిన భక్తులు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువస్తుంటారు. ఈ నేపథ్యంలో సీతారామునిపేట గ్రామం నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీరామ నామాన్ని జపిస్తూ స్వామివారి రథాన్ని ఊరేగింపుగా దేవాలయం వద్దకు తీసుకువచ్చారు. దీనికి ముందు రథం వద్ద అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామతీర్థానికి రథసప్తమి శోభ

రథసప్తమిని పురస్కరించుకొని రామతీర్థానికి భక్తులు పోటెత్తారు. భక్తులు ముందుగా రామకోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి రామస్వామి, ఉమాసదా శివుని ఆలయాల్లో పూజలు జరిపారు. ఈ సందర్భంగా క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.